# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

## చెరుకు శ్రీనివాస్ రెడ్డి హామీతో ఆందోళన విరమణ





**చేగుంట, మార్చి 17 సిరి న్యూస్:** తలాపున గోదావరి నీళ్లు వస్తున్నప్పటికీ తమ పంటలకు సాగునీరు రాక పోవడంతో చేతికి వచ్చిన పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆగ్రహించిన రైతులు గజ్వేల్- చేగుంట రహదారిపై ఇందుప్రియాల్ చౌరస్తాలోని రామాయంపేట కెనాల్ వద్ద టెంట్ వేసుకొని రహదారిపై కట్టెలు, ముళ్లపొదలను అడ్డంగా పెట్టి ధర్నా నిర్వహించారు. కిలోమీటర్ల పొడవునా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దౌల్తాబాద్ మండలం మాచినపల్లి, మెదక్ జిల్లా చేగుంట మండలం కసాన్ పల్లి, పోతాన్ పల్లి, చందాయిపేట, గోసన్ పల్లి, చిన్న శివనూర్, పెద్ద శివనూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు మధ్యాహ్నం వరకు రోడ్డుపై బైఠాయించి పంట పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న తోగుట సిఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ లు ధర్నా వద్దకు చేరుకొని రైతులను సముదా



యించారు. తమ గ్రామాలకు కాలువ ద్వారా నీరు అందించే వరకు బైఠా ఇస్తామని తెలుపగా మీ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని రైతులకు సీఐ హామీ ఇచ్చారు.

### రైతుల సమస్యలను పరిష్కరిస్తా..

రామాయంపేట కెనాల్ ద్వారా నీరు అందించి రైతుల సమస్యను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్చార్జ్ మంత్రి కొండాసురేఖ దృష్టికి తీసుకువెళ్లి వచ్చే సంవత్సరం జనవరి కల్లా గ్రామాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇవ్వగా రైతులు ధర్నాను విరమించారు. అనంతరం రైతులతో కలిసి రామాయంపేట కెనాల్ కాలువను పరిశీలించారు. కారర్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

# కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి

- అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి ఉత్తమ్
- నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి
- దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపిన ప్రభాకర్ రెడ్డి



దుబ్బాక, మార్చి 17 సిరి న్యూస్ : కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చేసిన విజ్ఞప్తికి మంత్రి తక్షణమే స్పందించారు. సోమవారం అసెంబ్లీలో మంత్రిని కలిసిన కొత్త ప్రభాకర్ రెడ్డి పంట పొలాలు ఎండిపోతున్నాయని,కూడవెల్లి వాగు నీళ్లు లేక వట్టి పోయిందని, కూడవెల్లి వాగు లోకి మల్లన్న సాగర్ జలాలు విడిచి దుబ్బాక నియోజకవర్గంలోని రైతుల పంట పొలాలు కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి వెంటనే నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మల్లన్న సాగర్ నుండి కూడవెల్లి వాగులోకి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని ఎమ్మెల్యే తెలిపారు. వాగు ప్రవహిస్తున్నందున వాగు పరివాహక రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి నీటి విడుదల చేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిన్న శంకరంపేట, రామాయంపేట కాలువలకు నీటి సరఫరా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.